

నర్సరీలో రిపబ్లిక్ డే జెండా ఆకృతి కూర్పు

ప్రజాశక్తి-కడియం

పల్ల వెంకన్న నర్సరీలో రిపబ్లిక్ డే సందర్భంగా మువ్వన్నెల జెండా, ఎర్రకోట, ఆకృతులతో పాటు రిపబ్లిక్ డే అక్షరమాలికను పల్ల వెంకన్న నర్సరీ డైరెక్టర్ పల్ల వెంకటేష్, వినయ్ సందేశాత్మకంగా తీర్చిదిద్దారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ ఆకృతిని ఏర్పాటు చేసినట్లు నర్సరీ అధినేత పల్ల సత్యనారాయణమూర్తి తెలిపారు.



పల్ల వెంకన్న నర్సరీలో రిపబ్లిక్ డే కూర్పు

తప్పని ఎదురుచూపులు..!

- భద్రత లేని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు
- సమాన పనికి సమాన వేతనం కరువు
- గృహ నిర్మాణ శాఖలో సిబ్బంది ఇబ్బందులు
- 18 ఏళ్లుగా విధుల్లో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆపరేటర్లు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎపి రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కరువైంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 245 మంది పని చేస్తుండగా రాష్ట్రవ్యాప్తంగా 2,300 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారా భర్తీ అయ్యి 18 సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. రూ.16,400 వేతనంగా ఇస్తున్నప్పటికీ పెరిగిన ధరలతో పోల్చుకుంటే ఏ మాత్రం సరిపోని పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికయినా పర్మినెంట్ అవుతామనే ఆశతో పని చేస్తున్నప్పటికీ భవిష్యత్తుపై బెంగతో ఆందోళన చెందుతున్నారు. జాబ్‌ఛార్ట్‌లో భాగంగా లబ్ధిదారుల గుర్తింపు, ఆన్‌లైన్లో వివరాలు నమోదు, జియో ట్యాగింగ్ వంటి పనులను సచివాలయాల్లో ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లతో పాటు వీరు కూడా చేస్తున్నారు.

రెగ్యులర్ ఆశతో ఎదురుచూపులు

2004లో అప్పటి సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. గడువులోగా పూర్తి చేయాలనే లక్ష్యంగా ఔట్ సోర్సింగ్ కింద వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. ప్రారంభంలో రూ.4,500 వేతనంతో విధుల్లో చేరారు. ప్రస్తుతం రూ.16 వేలకు మించి ఇవ్వడం లేదు. జీతాలు తక్కువైనా ఏదో ఒకరోజు ప్రభుత్వం రెగ్యులర్ చేయకపోదా అన్న ఆశతో గత 18 ఏళ్లుగా గృహ నిర్మాణ శాఖలో వీళ్ల పని చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక తరువాత వారి వివరాలు సేకరించడం, జియో ట్యాగింగ్ చేయడం, ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి లాగిన్‌కు అప్‌లోడ్ చేయడం, ఇంటి నిర్మాణాలకు కొలతలు ఇచ్చి పనులు మొదలయ్యేలా చూడడం వర్క్ ఇన్‌స్పెక్టర్ల ప్రధాన పనిగా మొదట్లో ఉండేది. లబ్ధిదారుని వివరాలు ఆన్‌లైన్, బిల్లులు అప్‌లోడ్ చేయడం వంటి పనులు డేటా ఎంట్రీ ఆపరేటర్లు చేసేవారు. సచివాలయ ఉద్యోగులు వచ్చిన తర్వాత వీరికి పని తగ్గించారు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత తమ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారందని ఈ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించారు. లబ్ధిదారుడి వివరాలను వార్డు వాలంటీర్ తీసుకొస్తారు. జియో ట్యాగింగ్, కొలతలు ఇవ్వడం, ఎం-బుక్ రికార్డు చేయడం వంటి పనులు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చేస్తుండగా ఆ వివరాలను డిజిటల్ అసిస్టెంట్లు ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని గత ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లిందనే ఆవేదన అందరిలోనూ వ్యక్తం అవుతోంది.



గృహ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న సిబ్బంది (ఫైల్ ఫోటో)

సమాన వేతనం లేదు

రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ సమాన పనికి సమాన వేతనం వీరికి అందడం లేదు. అందుకే కొన్నేళ్లుగా కనీస వేతనాలు అందించాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఈ ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్పొరేషన్‌లో ఉద్యోగ విరమణ పొందినవారి స్థానంలో సచివాలయ సిబ్బందిని ఇంజనీరింగ్ అసిస్టెంట్, వార్డ్ ఎమినిటీ సెక్రటరీలను మినహాయించి కార్పొరేషన్లలోనే చాలా ఏళ్లుగా పని చేస్తున్న అనుభవం కలిగిన ఎఇ, ఎంఐసి, డబ్ల్యుఐలను నియమించాల్సిందిగా వారు డిమాండ్ చేస్తున్నారు. ఖాళీలను సీనియారిటీని బట్టి డిఇఒలకు జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని కోరుతున్నారు.



ఉద్యోగ భద్రత లేదు

అనేక సంవత్సరాలుగా గృహ నిర్మాణ సంస్థలో తక్కువ వేతనాలతో పని చేస్తున్నాం. ఏ ప్రభుత్వం వచ్చినా ఉద్యోగ భద్రతపై నోరు మెదపడం లేదు. గతంలో సిఎం జగన్ ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు వారి ప్రభుత్వం వచ్చాక అందరినీ రెగ్యులరైజ్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారు. కానీ హామీను నిలబెట్టుకోలేకపోయారు. కూటమి ప్రభుత్వం స్పందించి మాసమస్యలను తక్షణమే పరిష్కరించాలి.

ఇ.చినబాబు, ఛైర్మన్,
ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ జెఎసి.



సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

గృహనిర్మాణ సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటి వరకు ఆదేశాలను అమలు పరచలేదు. ఇప్పటికే మేమంతా వయసు పైబడి ఇతర ఉద్యోగ అవకాశాలకు అర్హత కోల్పోయి ఉన్నాం. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగ భద్రత కల్పించి మా కుటుంబాలను రోడ్డున పడకుండా కాపాడాలి.

- ఉషా నాయుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్, కాకినాడ



సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ఆప్కోస్ ద్వారా ఎంపిక అవ్వడం వల్ల మా కుటుంబాలకు వచ్చే సంక్షేమ పథకాలన్నీ నిలిపివేస్తున్నారు. ప్రభుత్వం అందించే పథకాలను పునరుద్ధరించాలి. హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించి ఉద్యోగులను ఆదుకోవాలి.

- సిహెచ్.ప్రశాంత్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్, పిఠాపురం.

క్రీడల అభివృద్ధికి కృషి : మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాబోయే రోజుల్లో రాజమహేంద్రవరాన్ని క్రీడాపరంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం రాజమహేంద్రవరం నేషనల్ హైవే సమీపంలోని ఎస్‌పి గ్రౌండ్‌లోని గ్లాడియేటర్ క్రికెట్ క్లబ్‌లో లెజెండ్స్ కప్-2025 క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. క్రికెట్ బ్యాట్ చేతపట్టి కాసేపు యువతను, క్రీడాకారులను అలరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు, ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లభిస్తే అద్భుతంగా రాణిస్తారన్నారు. క్రీడాకారులకు ప్రాక్టీస్ చేసేందుకు అనువైన స్థలం కేటాయించాల్సి ఉందని తెలిపారు. జిల్లా ప్రధాన కేంద్రంగా ఉన్న రాజమహేంద్రవరంలో క్రీడా సౌకర్యాలను కల్పించేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, ఆర్యాపురం కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ చల్లా శంకర్ రావు, నిర్వాహకులు బాలాజీ, మురళీకృష్ణ, శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి దుర్గేష్



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహారావు

తక్కువ సాగు ఖర్చులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-రాజానగరం

రైతులు సాగు ఖర్చులు తగ్గించి, అధిక దిగుబడులు సాధించే దిశగా లాభసాటి వ్యవసాయం చేపట్టాలని ఏరువాక కేంద్రం రాజమహేంద్రవరం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. దీనికి శాస్త్రీయ సాంకేతిక విజ్ఞానాన్ని రైతులకు విస్తరణ కార్యక్రమం ద్వారా అందజేయాలని ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివన్నారాయణ, వ్యవసాయ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారని దివాన్ చెరువు ఏరువాక కేంద్రాన్ని డాక్టర్ జి.శివన్నారాయణ సందర్శించి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలైన డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ పనితీరును పరిశీలించారు. మినీ కిట్స్, విత్తనాల పంపిణీ, శిక్షణ, వ్యవసాయ సలహాలు వంటి కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారని, ఇంకా మరిన్ని నూతన సాంకేతిక పోకడలతో జిల్లా రైతాంగానికి మరిన్ని కార్యక్రమాలను వ్యవసాయ శాఖ, అనుబంధ సంస్థలతో సమన్వయంతో చేపట్టాలని ఆయన సూచించారు. అభ్యుదయ రైతులు పోతుల పద్మారావు, చావా శ్రీనివాస్, వ్యవసాయ విద్యార్థులు సరగడం నాగమణి పాల్గొన్నారు.

108లో గర్భిణి ప్రసవం

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన సూర్య కళ్యాణికి శనివారం ఉదయం పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 వాహనం సిబ్బందికి సమాచారం అందించారు. వాహన సిబ్బంది మల్లవరం గ్రామానికి చేరుకుని సూర్య కళ్యాణిని గోకవరం ప్రభుతాసుపత్రికి తరలిస్తుండగా పురిటినొప్పులు ఎక్కువ కావడంతో మార్గం మధ్యలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారని 108 వాహనం ఇఎంటి సురేష్, పైలెట్ రమణ తెలిపారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి-చాగల్లు


అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వాటికలో భాగంగా అంగన్‌వాడీ గర్భవతులు, బాలింతలు, వివిధ రకాల ఆకుకూరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి మాట్లాడుతూ పెరటిలో ఆకుకూరలను పెంచుకోవడం వల్ల నాణ్యమైన ఆకుకూరలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ సూపర్వైజర్ పద్మావతి, అంగన్వాడి వర్కర్ సారమ్మ, సూర్య కుమారి పాల్గొన్నారు.

సిసి కెమెరాలు అవసరం

ప్రజాశక్తి-చాగల్లు

నేరాలు అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకొవాలని చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర అన్నారు. గ్రామ శివారులో సిసి కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మండల పరిధిలోని సిసి కెమేరాలు ఎక్కువగా ఉన్నప్పటికీ వాటిలో చాలా పని చేయడం లేదని తెలిపారు.

కార్టూ'నిజం'



వ్యాసరచన పోటీలో విజేత రేణుక

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విద్యార్థులలో దేశభక్తి, వీరసైనికుల స్ఫూర్తిని నింపడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన గ్యాలంట్రీ అవార్డ్స్ పోర్టల్‌లో భాగంగా నిర్వహించిన పోటీలలో మండలంలోని తాడిపర్రు జెడ్‌పి పాఠశాల విద్యార్థిని కె.రేణుక ప్రథమ స్థానం పొందినట్లు పాఠశాల హెచ్‌ఎం కె.సరోజిని వెల్లడించారు. వీర గాథ 4.0లో భాగంగా జరిగిన జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో తాడిపర్రు విద్యార్థినులు పాల్గొనగా, వారిలో రేణుక విజేతగా నిలిచిందని ఆమె తెలిపారు. రిపబ్లిక్ డేను పురస్కరించుకుని ఆదివారం రాజమహేంద్రవరంలో బహుమతి అందుకునేందుకు వెళుతున్న రేణుకను, ఆమెకు తర్ఫీదునిచ్చిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ఎంవిఎస్‌ఎస్ హెచ్.అరవింద్ కుమార్‌ను గ్రామ సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, ఎస్‌ఎంసి ఛైర్మన్ జె.సూర్యనారాయణ ప్రశంసించారు.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేత

ప్రజాశక్తి -దేవరపల్లి

పల్లంట్ల గ్రామంలో మానవత స్వచ్ఛంద సేవ సంస్థ కార్యాలయంలో రాష్ట్ర మానవతా కన్వీనర్ బలుసు సత్యనారాయణకు రాజమహేంద్రవరానికి చెందిన ఎంవిఎస్.ప్రసాద్ రూ.లక్ష విలువ చేసే ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందించారు. ఈ సందర్భంగా బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ ఎమర్జెన్సీలో డాక్టర్ సిఫార్సు చేసిన వారికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్ ఉచితంగా అందిస్తామని తెలిపారు. పల్లంట్ల గ్రామంలో మానవత డైరెక్టర్ కూచిపూడి సత్యనారాయణ, ఆచంట సుభాష్ చంద్రబోస్ నిత్యం సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం చర్చి ఫాదర్ డేవిడ్ మాట్లాడుతూ మానవత సంస్థ ద్వారా అనేక సేవలు అందిస్తున్నామని తెలిపారు. దేవరపల్లి మండల హెల్త్ డైరెక్టర్ కరుటూరి పానయ్య, కిరణ్ విద్యా నికేతన్ కరస్పాండెంట్ జిఎస్‌ఆర్.రెడ్డి, బలుసు విజయలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

పిట్టల వేమవరంలో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని పిట్టల వేమవరంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 32 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స లేగదూడలకు నట్టల నివారణ మందులు, పాడి పశువులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్స్ అందించారు. ఈ సందర్భంగా ఖండవల్లి పశు వైద్యాధికారి డాక్టర్ సల్మా మాట్లాడుతూ పశువుల ఆరోగ్య భద్రతపై ఏ విధంగా ప్రత్యేక శ్రద్ధ చూపాలో పాడి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.చిన వెంకట రెడ్డి, ఎంపిటిసి ఆర్.దిలీప్ రాజు ఎన్.పురుషోత్తం, జి.చింత రాజు, వై.చెంగల్రావు, జూనియర్ పశు వైద్యాధికారి ఎఆర్.సోమేశ్వరి పశు వైద్య సహాయకులు బి.రాజశేఖర్, టి.భవాని, బి.శిరీష పాల్గొన్నారు.

అధ్యాపకురాలు రజనికి డాక్టరేట్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రభుత్వ అటానమస్ కళాశాల, రసాయన శాస్త్ర అధ్యాపకురాలు చేబ్రోలు రజనికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇచ్చినట్టు కళాశాల ప్రిన్సిల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె.తెలిపారు. ఆమె ఎఫ్‌టిఆర్‌ఐ స్టడీస్‌ని వివిధ రకాల ఆర్గానిక్ మిక్సచర్స్‌పై పరిశోధన చేసినట్టు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, సీనియర్ అధ్యాపకులు జాకబ్, శ్రీధర్, జె.సురేష్, ఇతర అధ్యాపకులు పాల్గొని అభినందించారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా శనివారం అవగాహన ర్యాలీలు, కార్యక్రమాలు చేపట్టారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యాన ఓటర్లలో అవగాహన, చైతన్యాన్ని కలిగించేందుకు, విద్యార్థులతో ఆర్ట్స్ కళాశాల నుండి ఆనం కళా కేంద్రం వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆనం కళా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడారు. డబ్బుకి ఓటు అమ్ముకోవడం తప్పు, ప్రజా సమస్యలకు ఓటే ఒక వజ్రాయుధం అని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలను, ఓటర్లలలో చైతన్యాన్ని నింపే నాటికలను విద్యార్థులు తిలకించారు. 24-1-2025న కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన, గ్రూప్ డిస్కషన్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు కమిషనర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పోతురాజు బాబ్జి, రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు ఫరా ఎశ్రూన్, ఎన్‌సిసి విభాగాధిపతి బాషా, డాక్టర్ బి.మల్లికార్జున్, డాక్టర్ డి.భవాని, కెపిబిఎల్.సరోజ, సిహెచ్ రామారావు పాల్గొన్నారు.

చాగల్లు తహశీల్దారు కార్యాలయం నుంచి మెయిన్ బజార్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు ఎం.మెరికమ్మ మాట్లాడారు. ప్రజలందరూ ప్రజాస్వామ్య విలువలు కాపాడే విధంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, పాల్గొన్నారు.

తాళ్లపూడి కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు బూత్ లెవెల్ అధికారులు శనివారం అవార్డులు అందుకున్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ స్వీప్ కో ఆర్డినేటర్, అంబాసిడర్ జోడాల వెంకటేశ్వరరావు ప్రతిభా పురస్కారం అందుకున్నారు. కొవ్వూరులోని విజయ విహార్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఆర్‌డిఒ కార్యాలయం వరకు విద్యార్థులు అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ జవహర్ బాజీ, ఎన్నికల డిటి నిరంజన్, రవి విక్రమ్, ప్రజ్ఞ వాసంతి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకుని ఓటరుగా నమోదవడంతో పాటు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొవ్వూరు నియోజకవర్గ స్వీప్ కో ఆర్డినేటర్, అంబాసిడర్ జోడాల వెంకటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. కొవ్వూరులోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు.

ఉండ్రాజవరం ఓటు హక్కును కచ్చితంగా ఉపయోగించుకోవాలని ఉండ్రాజవరం తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ సూచించారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని తహశీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు.

కడియం ఓటు ప్రజాస్వామ్యానికి జీవనాడి వంటిదని ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించు కోవడంతో పాటుగా ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకోవాలని కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ పేర్కొన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, రెవెన్యూ,పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని, కార్యదర్శి ఎం.శ్రీనివాస్ రెడ్డి, హెచ్‌ఎం టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పెరవలి మండలం పెరవలి, తీపర్రు, ఉసులుమర్రులో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో తహశీల్దారు డి.అచ్యుత కుమారి, సర్పంచ్ గొంగోలు సీతమ్మ, జోసెఫ్ బొడ్డు రామాంజనేయులు, సింహాద్రి సత్యనారాయణ, కంటిపూడి సూర్యనారాయణ ఉప్పలపాటి సత్తిరాజు, పడాల శ్రీను, పుల్లా శేఖర్ జన్ని చిన్న, బ్రహ్మన్న పాల్గొన్నారు.



కడియంలో విద్యార్థుల మానవ హారం



రాజమహేంద్రవరంలో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి

బ్యాడ్మింటన్‌లో జ్ఞాన సరస్వతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గోకవరం

ఇటీవల తమిళనాడు రాష్ట్రంలో జరిగిన ఓపెన్ స్టేట్ బ్యాట్మెంటన్ పోటీల్లో స్టేట్ ఫస్ట్, సెకండ్, థర్డ్ ర్యాంక్‌లో జ్ఞాన సరస్వతి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు నిలిచారు. స్కూల్ ఛైర్మన్ కంచర్ల ప్రకాష్, స్కూల్ పౌండర్ డైరెక్టర్ బొడ్డేటి సురేష్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ప్రకాష్ ఫౌండర్ డైరెక్టర్ సురేష్ మాట్లాడుతూ చెన్నైలో జరిగిన ఓపెన్ బ్యాట్మెంటన్ పోటీల్లో 9వ తరగతి చదువుతున్న లోకేష్ డబల్ విభాగంలో స్టేట్ ఫస్ట్, సింగిల్స్ విభాగంలో స్టేట్ సెకండ్ స్థానాల్లో నిలిచాడని, 6వ తరగతి విద్యార్థి అఖిల్ మూడో స్థానంలో నిలిచాడన్నారు. ఐదు రాష్ట్రాల మధ్య జరిగిన ఈ బ్యాడ్మింటన్ పోటీల్లో జ్ఞాన సరస్వతి విద్య నికేతన్ స్కూల్ విద్యార్థులు స్టేట్ ఫస్ట్, సెకండ్ థర్డ్ స్థానాలు గెలుచుకోవడం మాకు చాలా గర్వంగా ఉందన్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు పిఇటి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.



గెలుపొందిన జ్ఞాన సరస్వతి విద్యానికేతన్ విద్యార్థులు

రిటైర్డ్ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -దేవరపల్లి

ఎపి స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఏలూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కృష్ణ, జంగారెడ్డిగూడెం ఎటిఒ చంద్రయ్య, ఎస్‌టిఒ చినబాబు శనివారం ఆవిష్కరించారు. జంగారెడ్డిగూడెం అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు బండి సూర్య ప్రకాశ రావు, దేవరపల్లి మండలం గౌరవాధ్యక్షుడు కేశిరాజు సీతారామయ్య, అధ్యక్షులు పప్పు వెంకట రామారావు, ప్రధాన కార్యదర్శి ఈడ్పుగంటి నాగేశ్వరరావు హాజరయ్యారు. విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశంలో చర్చించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి సూర్యప్రకాశ రావు మాట్లాడుతూ 2018 జులై తరువాత మరణించిన విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన డిఆర్, పిఆర్‌సి బకాయిలను వారి వారసులకు వెంటనే చెల్లించాలన్నారు. ఫ్యామిలీ పెన్షనర్ల పుట్టిన తేదీ పిపిఒలో నమోదు చేయాలన్నారు. పిపిఒలో ఉన్న తప్పులను సరి చేయాలన్నారు. 2022 పిఆర్‌సి కన్సాలిడేటెడ్ సర్టిఫికెట్‌ను విశ్రాంత ఉద్యోగులు అందరికీ అందజేయాలన్నారు. ఇహెచ్‌ఎస్ కార్డులపై నగదురహిత వైద్యం అందజేయాలన్నారు.

ఉల్లాస్ రెండో విడత శిక్షణ

ప్రజాశక్తి-పెరవలి

స్థానిక మండల సమైక్య కార్యాలయంలో ఉల్లాస్ రెండో విడత శిక్షణ కార్యక్రమం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సిహెచ్.వెంకటరమణ, వెలుగు ఎపిఎం బండారు రామకృష్ణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిజిటల్, ఆర్థిక, క్రియాత్మక అక్షరాస్యత సాధించడమే ఉల్లాస్ లక్ష్యం ఆర్థిక, డిజిటల్, క్రియాత్మక అక్షరాస్యతను సాధించడమే ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యమన్నారు. కేరళ తరహాలో నూటికి నూరు శాతం ఇక్కడ కూడా అక్షరాస్యత సాధించాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగానే వయోజన విద్యా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ నేపథ్యంలో మండలంలో 700 మంది అభ్యాసకులకు ఆర్థిక అక్షరాస్యతను నేర్పించాలన్నారు. ముఖ్యంగా ఆర్థిక భావనలు, ప్రణాళికల వ్యూహంతో సన్నద్ధం చేయడం, ఆర్థిక నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించేల చూడాలన్నారు. తద్వారా ఆర్థిక వనరులపై నియంత్రణ వస్తుందన్నారు.

రిపబ్లిక్ డే వేడుకకు కె.సావరం సర్పంచ్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆదివారం ఢిల్లీలో నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకలకు మండలంలోని కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణకు ఆహ్వానం అందింది. గ్రామ సర్పంచుల నుంచి పెరేడ్‌కు హాజరయ్యేందుకు జిల్లాకు సంబంధించి, ఉండ్రాజవరం మండలం కె.సావరం సర్పంచ్‌కు ఈ అరుదైన అవకాశం రావడం పట్ల గ్రామ ప్రజలు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రామకష్ణ న్యూఢిల్లీ నుంచి ఫోన్‌లో మాట్లాడారు. తనకు ఈ అరుదైన అవకాశం కల్పించిన కేంద్ర ప్రభుత్వం, మంత్రులు పవన్ కళ్యాణ్,కందుల దుర్గేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నేరాలు ఘోరాలు



డాగ్ స్క్వాడ్‌తో పరిశోధన చేస్తున్న పోలీసులు

రూ.30 లక్షల విలువైన సొత్తు చోరీ

ప్రజాశక్తి - రాజోలు

రాజోలు సత్తిరాజు వీధిలో భారీ చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి, నగదు దొంగిలించారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రాజోలు సత్తిరాజు వీధిలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు గెల్లి బాపన్న గుప్త ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 20న అన్నవరం వెళ్లారు. 24 వ తేదీ శుక్రవారం పని మనిషి ఇల్లు శుభ్రం చేసేందుకు గేటు తీయగా ఇంటి తలుపులు పగుల గొట్టి ఉన్నట్లు గుర్తించి ఇంటి యజమానికి సమాచారం అందించింది. వారు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బట్టలగొట్టి లోపల ఇనుప పెట్టెలో 45 కాసుల బంగారం, ఐదు కేజీల వెండి, రూ.30 వేలు నగదు దొంగిలించారని ఇంటి యజమాని గుప్తా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని రాజోలు సిఐ నరేష్ కుమార్, ఎస్ఐ బి.రాజేష్ కుమార్ పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రప్పించి ఆధారాలు సేకరించారు. దొంగలు ప్రహరీ గోడ దూకి లోపలికి ప్రవేశించారని, దొంగతనం చేసి అక్కడి నుంచి మాతాజీ ఆశ్రమం వైపు వెళ్లినట్టు డాగ్ స్క్వాడ్ కదలికలను బట్టి పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

గుర్తు తెలీని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి రావులపాలెం గౌతమి గోదావరి బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు శనివారం పోలీసులు తెలిపారు. వివరాలు ఇవి.. గౌతమి గోదావరి బ్రిడ్జి వద్ద సుమారు 35 సంవత్సరాల వయస్సు గల పురుషుని మృతదేహం ఉందని, మృతుడు ఎరుపురంగు షర్ట్, ఆపోలో బ్రౌన్ కంపెనీ టీ షర్ట్, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహం బంధువులు గుర్తు పట్టేందుకు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరింత వివరాలు తెలిసినవారు ఎస్‌హెచ్‌ఒ సెల్ నెంబర్‌కు 9440796557 సమాచారం అందించాలన్నారు. స్థానిక పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మామ చేతిలో అల్లుడు హతం

ప్రజాశక్తి - కడియం

కడియం మండలం కడియపులంకలో మామ చేతిలో అల్లుడు హతమయ్యాడు. భార్య, అత్తలపై దర్యాప్తులో తేలనుందని కడియం సిఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి సిఐ విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోరుకొండ గ్రామానికి చెందిన శ్రీరంగం సూర్య వెంకట గణేష్ (36) రెండేళ్లుగా తన భార్య మాధవి, వారి ఇద్దరు పిల్లలతో కడియపులంక పాత రామాలయం వీధిలోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. వ్యసనాలకు బానిసైన గణేష్ తరచూ మద్యం సేవించి భార్యతో గొడవ పడుతుండేవాడని తెలిపారు. ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిన గణేష్ 24వ తేదీ రాత్రి వచ్చి మరోసారి భార్యతో గొడవ పడినట్లు తెలిపారు. ఈ సమయంలో ఆ ఇంట్లో తన భార్యతో పాటు అత్త నాగమణి, మామ సత్తిబాబు ఉన్నారని డబ్బులు విషయమై భార్యాభర్తల మధ్య ఏర్పడిన వివాదంతో అత్తమామలు, భార్య కర్రతో గణేష్ తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. చికిత్స నిమిత్తం కడియం సిహెచ్‌సి తరలించగా గణేష్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని సిఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి తరలించినట్లు కడియం పోలీసులు తెలిపారు.

విద్యార్థిని మిస్సింగ్ కేసు నమోదు

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక శనివారం మధ్యాహ్నం నుండి కనపడటం లేదని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం తాళ్లపూడికి చెందిన బొమ్మిడి వైష్ణవి శనివారం మధ్యాహ్నం బయటకి వెళ్లి తిరిగి రాలేదని తల్లిదండ్రులు శ్రీనాథ్, బబ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగిన ఇద్దరు మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు, ముమ్మిడివరం

పట్టణానికి చెందిన రాజాల వెంకన్న(40) పురుగుల మందు తాగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లప్రోలు నగర పంచాయతీకి చెందిన రాజాల వెంకన్న వ్యవసాయదారుడు. అతను కొంతకాలంగా మద్యానికి బానిసై ఉండటంతో అతని తల్లిదండ్రులు, భార్య మందలించారు. దీంతో మనస్తాపానికి గురియైన అతను మంగళవారం తన ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబసభ్యులు కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. అతని చిన్న కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మిడివరం పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ ఒక యువకుడు ఆసుపత్రిలో మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని క్రాప చింతలపూడి పాలెం గ్రామానికి చెందిన మధుర గోపాలకృష్ణ (27) గత బుధవారం పురుగుల మందు తాగాడు. అతను అపస్మారక స్థితిలో పడిఉండటంతో బంధువులు అమలాపురంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు హెచ్‌సి ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పశువులను తరలిస్తున్న వ్యాన్ సీజ్: వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

చందుర్తి జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా పశువులతో ఉన్న వాహనాన్ని పట్టుకున్నారు. పశువులను తరలిస్తున్న దాలివలస గ్రామానికి చెందిన మేడిశెట్టి తాతారావుపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

'ప్రయివేటు'కు అడ్డుకట్ట పడేదెప్పుడో..!

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రయివేట్ ట్రావెల్స్ ఏజెన్సీలకు ఇప్పట్లో కళ్లెం పడే పరిస్థితి కానరావట్లేదు. ఫలితంగా ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. పండుగకు ఇంటికి వచ్చి తిరిగి ఉపాధి ప్రాంతానికి పోయేవారు కొందరైతే... ఉపాధిని వెతుక్కుంటూ వెళ్లేవారు మరికొందరు. ఇలాంటి వారి అవసరాలను ఆసరాగా చేసుకుని ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. అధిక ఛార్జీలు మాట అలా ఉంచినా... ప్రయాణికుల ప్రాణాలకు భరోసా ఇవ్వలేని పరిస్థితి జిల్లాలో నెలకొంది. జిల్లాలో జరిగిన రెండు ప్రయివేటు బస్సుల ప్రమాదాలే దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం ఆర్ట్స్‌కాలేజీ వద్ద ప్రయివేటు బస్సు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన మరువక ముందే కాకినాడ సమీపంలోని గామన్ బ్రిడ్జిపై కావేరి ట్రావెల్స్ బస్సు బోల్తా పడి ఒకరు మృతి చెందారు. రెండు కాళ్లు కోల్పోయి ఒకరు, వెన్ను విరిగి మరొకరు, లేవలేని గాయాలతో ఇంకొకరు ఇలా మరో ఐదుగురు మంచానికే పరిమితమయ్యారు. ఇంకో 15 మంది గాయపడి సొంతంగా వైద్యం చేయించుకుంటున్నామని వారి ప్రాంతాలు వెళ్లిపోయారు. ఈ రెండు ఘటనల్లోనూ డ్రైవర్లు మద్యం మత్తులో ఉండటం, వాహనాలను వేగంగా నడపడటమే కారణమని సుస్పష్టం. అయినా వారిపై నేటికీ సరైన చర్యలు తీసుకోకపోవడం వ్యవస్థలో లోపాలను ఎత్తి చూపుతున్నాయి.

సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాకు రాకపోకలు పెరిగాయి. ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు వేసినా చాలని పరిస్థితి. ఈ పరిస్థితిని ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఏటా ఇదే పరిస్థితి ఉన్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా లేవు. లిఖిత పూర్వక ఫిర్యాదులు ఏవీ రాలేదని, వస్తే చర్యలు తీసుకుంటామని చెప్పి వారు తప్పుకుంటున్నారు. అంతేకాకుండా పండుగ సమయాల్లో ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలు కాలం చెల్లిన బస్సులను రోడ్లపైకి తీసుకొస్తున్నాయి. బహిరంగంగా వీటిని వీధులపైకి తెస్తున్నా చర్యలు తీసుకునే నాథుడే కానరావట్లేదు. అడ్డుకట్ట వేయాల్సిన రోడ్డురవాణా సంస్థ అధికారులు కేవలం హెచ్చరికలకే పరిమితమవుతున్నారు. దీంతో ప్రయాణికులు ఆర్థికంగా దోపిడీకి గురవ్వడంతో పాటూ ప్రమాదాల భారిన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

వినియోగదారులపై సర్దు'పోట్లు'

ప్రభుత్వాలు మారినా ప్రజలకు విద్యుత్ సర్దు'పోట్లు' మాత్రం ఆగట్లేదు. శీతాకాలంలోనూ విద్యుత్ బిల్లులు వేడిని పుట్టిస్తున్నాయి. ముట్టుకుంటేనే షాక్ కొడుతున్నాయి. తాజాగా జనవరి బిల్లులో ఎఫ్‌పిపిఎ 3 పేర మరో బాదుడుకు ప్రభుత్వం తెరలేపింది. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నీటి మూటలే అని మరోమారు తేటతెల్లం అయ్యింది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనూ వరుసగా మూడు దఫాలు సర్దుబాటు ఛార్జీలు విధించడంతో ప్రజలుతీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసులు కంటే ప్రభుత్వం వడ్డించే కొసరు ఛార్జీలే అధికమవ్వడంతో ప్రజలంతా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వారి ఆగ్రహం త్వరలోనే మరో విద్యుత్ ఉద్యమానికి దారితీసే పరిస్థితులూ లేకపోలేదనేది పలువురి అభిప్రాయం. ఇప్పటికే విద్యుత్ ఛార్జీలపై వామపక్షాలు ఆందోళనకు దిగాయి. వీరి ఆందోళనలకు చాలాచోట్ల ప్రజల మద్దతు కూడా దక్కింది. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరుస్తుందో... లేదా ప్రజాగ్రహానికి బలవుతుందో చూడాలి.

సిఐటియు ఖాతాలో మరో కార్మిక విజయం

కార్మికుల పక్షాన సమరశీల పోరాటాలను నిర్వహిస్తున్న సిఐటియు కార్మిక సంఘం ఖాతాలో మరో విజయం తాజాగా నమోదైంది. ఏలేశ్వర్యంలో జీడిపిక్కల పరిశ్రమ లాకౌట్ నేపథ్యంలో కార్మికులు ఆందోళన బాట పట్టిన విషయం విధితమే. ఈ ఆందోళనలకు సిఐటియు నాయకత్వం వహించింది. గడిచిన ఆరునెలలుగా సమరశీల పోరాటాన్ని నిర్వహించింది. ఒక దశలో నాయకులను అక్రమ అరెస్టులు చేసినా కార్మికులు సంఘటితంగా ఉండి ప్రజాప్రతినిధుల ఇంటి ముందు సైతం ఆందోళనలను చేశారు. ఈ నేపథ్యంలో దిగొచ్చిన యాజమాన్యం కార్మికులకు బెనిఫిట్స్ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఎట్టకేలకు పరిహారం చెల్లిస్తామని అంగీకరించింది.



పెచ్చులూడుతున్న తహశీల్దార్ కార్యాలయం

-బిక్కుబిక్కుమంటూ సిబ్బంది
-కన్పించని మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి - కోటనందూరు

స్థానిక తహశీల్దార్ కార్యాలయం పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. కార్యాలయం శిధిలావస్థకు చేరింది. స్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. బిక్కుబిక్కుమంటూ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. దీనికితోడు కనీస సౌకర్యాలు కరువయ్యాయి.

మండల పరిధిలో 17 గ్రామ పంచాయతీల్లో



స్లాబ్ నుంచి ఊడిపోతున్న పెచ్చులు



ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు పడుతున్న ప్రజలు

సుమారు 48,453 వేల మంది జనాభా ఉన్నారు. ఆయా గ్రామాల నుంచి వివిధ అవసరాల కోసం నిత్యం తహశీల్దార్ కార్యాలయానికి వందల సంఖ్యలోనే వస్తూ ఉంటారు. అయితే కార్యాలయంలో కనీస మౌలిక సదుపాయాలు ఉండటం లేదు. ఆఖరికి తాగునీటి సౌకర్యాన్ని కల్పించలేని దుస్థితిలో కార్యాలయం ఉంది. కార్యాలయంలో ఉన్న జనరేటర్, యుపిఎస్ బ్యాటరీలు గత కొంతకాలంగా పని చేయడం లేదు. అవి కేవలం అలంకార ప్రాయంగానే ఉన్నాయి. కరెంటు పోతే కంప్యూటర్లన్నీ మూగబోతున్నాయి. పైగా ఇదే కార్యాలయంలో ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో పిల్లా, పెద్దలతో పెద్దఎత్తున ఆధార్ నమోదు కొరకు నిత్యం వస్తూనే ఉన్నారు. అయితే ఏదైనా కారణంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే కంప్యూటర్లన్నీ మూగబోతున్నాయి. ప్రత్యమ్నాయంగా జనరేటర్ సదుపాయం ఉన్నా అది పని చేయకపోవడంతో తిరిగి విద్యుత్ వచ్చేంత వరకూ ఆధార్ నమోదు కేంద్రం వద్ద పడిగాపులు పడుతున్నారు. ఇదిలావుంటే..తాసిల్దార్ కార్యాలయం భవనం పూర్తిగా శిధిల వ్యవస్థకు చేరుకుంది. తహశీల్దార్, ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వహించే గదిల్లో స్లాబు పైనుంచి పెద్ద పెద్ద పెచ్చులు విరిగి పడిపోతున్నాయి. దీంతో భయం భయంగా వారు విధులు నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే స్లాబులో నుంచి వర్షపు నీరు గదిలోకి నీరు వచ్చి చేరడంతో రికార్డులు తడిసిపోతున్నాయి. గత 10 సంవత్సరాల కాలం నుంచి తహశీల్దార్ కార్యాలయానికి ఎటువంటి మరమ్మతులు నిర్వహించలేదని సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి తహశీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు చేపట్టడంతోపాటు, కార్యాలయానికి అవసరమైన కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహశీల్దార్ టి.సుభాస్‌ను వివరణ కోరగా రెండు నెలల క్రితం కార్యాలయ మరమ్మతుల కోసం రూ.10 లక్షల వ్యయం అవుతుందని ప్రతిపాదనలను జిల్లా అధికారులకు నివేదించినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపడతామని వివరించారు.

ఆకట్టుకున్న 2వ రోజు నాటికలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2వ రోజు నాటికల పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విచ్చలవిడి, పరిమితులు, నియంత్రణ లేని స్వేచ్ఛ జీవిత పతనానికే కాకుండా సామాజిక విచ్ఛిన్నానికి దారితీస్తుందన్న సందేశంతో ప్రదర్శించిన 'స్వేచ్ఛ'



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

నాటిక ఆకట్టుకుంది. అలాగే 'వర్క్ ఫ్రం హోం' నాటిక ఆద్యంతం ప్రేక్షకులను హాస్యంతో అలరించింది. ప్రతి మనిషిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందన్నది ఏదో ఒకనాడు బయటపడుతుందని, మనసుకు నచ్చిన పనిలో మమేకమైనప్పుడు ఆ మనిషి మానసిక ఆనందం వర్ణనాతీతం అనే సందేశంతోపాటు, హాస్యాన్ని మేళవించిన ఈనాటిక అందర్నీ అలరించింది. తొలుత ఈ నాటిక పోటీలను ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, కళాకారులు గోపు సత్తిబాబు, మాజీ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కొమ్మిరెడ్డి బుజ్జి, రేలంగి బుజ్జి, సిఎస్ఆర్.మూర్తి నాటక రంగం ప్రాముఖ్యతపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇంధన బ్రహ్మానందం, కొత్తెం స్వామినాథన్, దేవాడ పాపేశ్వరరావు, మంతిని సత్తిబాబు, మానేపల్లి రవీంద్ర, కేదారి నాగేశ్వరరావు,



నాటిక ప్రదర్శనలో ఒక సన్నివేశం

వెన్న సత్యనారాయణ, నూకల మంతి నానాజీ, పాలాని సత్తిబాబు, కురుమేల్ల శ్రీనివాసు, కమ స్వామి మా గాపు నాశ్వరరావు కంటిపోయిన ప్రసాద్, జ్యోతుల దొరబాబు, సమ్మెట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు రొంగల వీర్రాజు. దారపురెడ్డి కృష్ణ, డి సత్యనారాయణ, రామిరెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు గీతాలు ఆలపించారు. ఈ పరిషత్తుకు న్యాయ నిర్ణేతలుగా కె.శాంతారావు, జిఎస్ఆర్.స్వామి, డి.రాధాకృష్ణ వ్యవహరించారు.

యానాం వార్తలు



ఓటు గుర్తింపు కార్డును అందజేస్తున్న మునిస్వామి

ఘనంగా ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఎన్నికల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిపాలనాధికారి మునిస్వామి పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కుకి దరఖాస్తు చేసుకున్న వారికి ఓటు గుర్తింపు కార్డులను అందజేశారు. క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరులో ఉన్న లార్డ్ వెంకీ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీపై ఆధారపడిన 50 మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 16వ తేదీన విధులు నిర్వహిస్తూ ఒక కార్మికుడు మృతి చెందాడు. నాటి నుంచి మిల్లు యాజమాన్యం కంపెనీని మూసివేసిందని అన్నారు. నాటి నుంచి ఉపాధి లేక 50 కార్మిక కుటుంబాలు నాని ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. తక్షణమే యాజమాన్యం కంపెనీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న తుమ్మలపాల్లి రమేష్

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - జగ్గంపేట

జనసైనికులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. శనివారం స్థానిక కృష్ణవేణి థియేటర్ వద్ద నియోజకవర్గ స్థాయి జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ పాలన, జనసేన కార్యక్రమాలపై చర్చించారు. ఎస్ఎంసి, నీటి సంఘం ఎన్నికలు, రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యోగాల నియామకాలు, డ్వాక్రా యానిమేటర్ వంటి ఉద్యోగాల బదిలీల్లో జనసేనకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు అధైర్య పడవద్దని, పొత్తులో మన పార్టీకి రావాల్సిన భాగస్వామ్యాన్ని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కొన్నిసార్లు తగిన ప్రాధాన్యత దక్కకపోయినా పొత్తు ధర్మాన్ని పాటిస్తున్నామని గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సూరంపాలెం బాలు, నాలుగు మండలాల జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదరంగ పోటీ విజేతకు సత్కారం

ప్రజాశక్తి - పెద్దాపురం

జాతీయస్థాయి స్కూల్ ఛాంపియన్ షిప్ చదరంగం పోటీల్లో అండర్ 17 విభాగంలో ప్రథమ స్థానం సాధించిన పట్టణానికి చెందిన ముప్పన జ్ఞాన సాయి సంతోష్‌ను శనివారం ఘనంగా సత్కరించారు. శనివారం స్థానిక జనసేన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం కూడా ఛైర్మన్ తుమ్మల బాబు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ మార్చి నెలలో సెర్బియా దేశంలో జరిగే అండర్-17 వరల్డ్ చెస్ ఛాంపియన్షిప్ పోటీలో భారతదేశం తరుపున సాయి సంతోష్ పాల్గొనేందుకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా సాయి సంతోష్‌ను పూలమాలలు, సాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు దాసు శివబాబు, నాయకులు వీరరాఘవులు, కంచుమర్తి రాజన్న, కొండలరావు, పోలినాటి గౌతం, అభిషేక్, ఒబిలిశెట్టి గణేష్, తమనార లక్ష్మణ్ దివాకర్, సామర్లకోట మండల అధ్యక్షులు మలిరెడ్డి బుచ్చిరాజు, లాయర్ రవి దువ్వా సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల వద్ద పరిసరాల పరిశుభ్రత

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక విద్యాశాఖ కార్యాలయం, పశువుల ఆసుపత్రి ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను ఆయా కార్యాలయ సిబ్బంది శనివారం ఉదయాన్నే తొలగించారు. గత బుధవారం కలెక్టర్ షాన్‌మోహన్ పశువుల ఆసుపత్రి, విద్యాశాఖ కార్యాలయాలను సందర్శించి పరిశరాల పరిశుభ్రతపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలోనే శనివారం ఆయా కార్యాలయాల పరిసరాలను సిబ్బంది శుభ్రం చేశారు.

రాజ్యాంగాన్ని పూర్తిగా అమలు చేయాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక కంబాలచెరువు పార్కు నుంచి దేవిచౌక్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి బి. పవన్, జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కనక మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బి.పవన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తిగా రాజ్యాంగం అమలు కావట్లేదని, ఈ దేశంలో సంపద అతి కొద్ది మంది దగ్గరే ఉంటోందని తెలిపారు. సంపద ఎప్పుడయితే ప్రజలందరికీ సమానంగా వెళ్తుందో అప్పుడే ఈ దేశం లో ప్రజల కష్టాలు తీరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మౌళి, తేజ, శివ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న పవన్

ప్రొఫెసర్ వడలి శ్రీనివాస్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - తాళ్లరేవు

కైట్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ అధ్యాపకుడు కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ వడలి శ్రీనివాస్ జెఎన్‌టియుకె నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో డీప్ లెర్నింగ్ ద్వారా కాలేయం సమస్యల విశ్లేషణ, విభజన, తీవ్రత అంచనా అనే అంశంపై అధునాతన పద్ధతులతో చేసిన పరిశోధన పత్రాన్ని అందించానని, దీనికి జెఎన్‌టియుకె పిహెచ్‌డి ప్రధానం చేసినట్లు తెలిపారు. శనివారం యూనివర్సిటీ నుంచి ధ్రువీకరణ పత్రం అందినట్లు చెప్పారు. జెఎన్‌టియుకె ప్రొఫెసర్లు డాక్టర్ జివిఎస్ఆర్.దీక్షితులు, డాక్టర్ జెవిఆర్.మూర్తి పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు తెలిపారు.



వడలి శ్రీనివాస్

వల్లభ స్వామికి రూ.2.21 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి వివిధ రూపాల్లో శనివారం ఒకరోజు రూ.2.21 లక్షల ఆదాయం వచ్చింది. వివిధ దర్శనం టికెట్ల ద్వారా రూ.1,16,620, అన్నదాన విరాళాల ద్వారా రూ.78,197, కేశఖండన ద్వారా రూ.4,920, తులాభారం ద్వారా రూ. 300, లడ్డు ప్రసాదం ద్వారా రూ.21,225, కానుకుల ద్వారా రూ.250 మొత్తం రూ.2,21,512 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఎస్.అగ్రహారం గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని గ్రామానికి చెందిన దళితులు, వికలాంగులు శనివారం ఎంపిడిఒ శివరామకృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఉన్నతా అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి ఉపాధి హామీ పనులు కల్పించేందుకు కృషి చేస్తానని ఎంపిడిఒ వారికి హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - ఆలమూరు

జాతీయ రహదారి 216ఎపై మడికి డివైడర్ వద్ద స్కూటీ ఇద్దరు యువతలను శనివారం ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఉంగ్రాజవరం మండలం అజ్జరానికి చెందిన గడ్డం పాపారావు చింతకాయల నారాయణమూర్తి స్కూటీపై రాజమహేంద్రవరం వైపు నుంచి రావులపాలెం వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో మడికి డివైడర్ వద్ద రోడ్డు దాటుతున్న స్థానిక యువతులు ఉంగ్రాజపు సౌందర్య, మందపల్లి ముత్యాలును స్కూటీ వేగంగా ఢీ కొట్టింది. దీంతో స్కూటీ మీద వస్తున్న పాపారావు, నారాయణమూర్తిలతో పాటు యువతులు సౌందర్య, ముత్యాలు లతో కలిపి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో హైవే సిబ్బంది హుటాహుటిన హైవే అంబులెన్స్‌పై క్షతగాత్రులను రాజమహేంద్రవరం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణ చేశారు.

హాస్టల్ విద్యార్థి అదృశ్యం

ప్రజాశక్తి - పెరవలి

రాజమహేంద్రవరం దానవాయి పేటకు చెందిన కొడమంచిలి యశ్వంత్ మండలంలోని ఖండవల్లి ఎస్‌సి సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో ఉండి స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 24న ఉదయం స్కూల్‌కి వెళ్ళి, మరలా 10 గంటలకు హాస్టల్‌కు తిరిగి వచ్చి అనంతరం కనిపించలేదు. తల్లి సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు బాలుని వివరాలు తెలిసిన వారు 9440796642, 9154875611 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.



యవ్వంత్(ఫైల్‌ఫోటో)

సీనియర్ అసిస్టెంట్ రంగనాయకులు మృతి

ప్రజాశక్తి - కాజులూరు

మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ కెఎస్.రంగనాయకులు(52) ఆకస్మికంగా మృతి చెందారు. గత రెండు నెలలుగా అనారోగ్యంతో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం కుదుట పడడంతో రామచంద్రపురంలో గల ఆయన సొంత నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన శనివారం ఉదయం ఆకస్మాత్తుగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి ఎంపిడిఒ రాంబాబు, ఎంపిపి మాత భారతి, జడ్‌పిటిసి సభ్యులు వెంకట సుబ్బారావు, కార్య నిర్వహణ అధికారి నాగేశ్వర శర్మ, టైపిస్ట్ సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ మైథిలి, పలువురు కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సంతాపం తెలిపారు.




రంగనాయకులు(ఫైల్‌ఫోటో

హైస్కూల్‌కు సామగ్రి అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయ భూపాలపట్నం జడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అదే గ్రామానికి చెందిన దాతలు కల్తూరి నారాయణరావు, మేకా సతీష్‌కుమార్, మార్ని కాశీవిశ్వనాథం శనివారం అందజేశారు. సుమారు రూ.20 వేల విలువ చేసే జిరాక్స్ ప్రింటర్, ప్రింటింగ్ స్టేషనరీ, ఇంకు బాటిల్స్, ఎ 4 పేపర్ బండిల్స్ హెచ్ఎం మల్లేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మాటిమాటికి స్కూల్ నుంచి బయటికి వెళ్లి జిరాక్స్ సెంటర్ల చుట్టూ తిరగవలసిన అవసరం ఉండదని, ఉపాధ్యాయులు విద్యార్థులకు



హెచ్‌ఎంకు సామాగ్రిని అందిస్తున్న దాతలు

అవసరమైన ప్రింట్స్ ఇచ్చేందుకు వీలుగా వీటిని అందజేశామన్నారు. దాతలకు హెచ్ఎం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ చిన్న, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.